ప్రజాశక్తి

మంగళవారం 2 జనవరి 2024








కలెక్టర్ అరుణ్‌బాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఉద్యోగులు

# సరి 'కొత్త' శోభ..!

◆ జిల్లా వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు

◆ ప్రజాప్రతినిధుల ఇళ్ల వద్ద సందడి

◆ ప్రభుత్వ కార్యాలయాల్లోనూ వేడుకలు

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

జిల్లాలో నూతన సంవత్సర వేడుకలు అంబరాన్ని అంటాయి. చిన్నాపెద్దా అన్న తేడా లేకుండా అందరూ సంతోషంగా వేడుకలు జరుపుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి 2023కి టాటా చెప్పి 2024కు స్వాగతం పలికారు. సోమవారం ఉదయం ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలుపుకున్నారు. చిన్నారులు కొత్త దుస్తులు ధరించి తోటి మిత్రులకు శుభాకాంక్షలు తెలిపారు. అధికారులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, రాజకీయ పార్టీ నాయకుల నివాసాలు సందర్శకులతో కిటకిటలాడాయి. తమ అభిమాన నాయకునికి శుభాకాంక్షలు చెప్పేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు తరలివచ్చారు. అధికారులు కూడా వారి ఉన్నత శాఖ అధికారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం అధికారులు, ప్రజలు, సందర్శకులతో కిక్కిరిసింది.



తోపుదుర్తి సోదరులను గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆదివారం అర్ధరాత్రే యువత వేడుకలను చేసుకుంది. కేకలు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. సోమవారం ఉదయం మిత్రులు, బంధువులకు శుభాకాంక్షలు తెలియజేశారు. నాయకుల ఇళ్ల వద్ద ఆయా పార్టీ నేతలు శుభాకాంక్షలు తెలిపేందుకు బారులుదీరారు. దీంతో వారి ఇళ్ల వద్ద సందడి నెలకొంది. అనంతపురం, శ్రీసత్యసాయి కలెక్టర్లలో పెద్ద సంఖ్యలో అధికారులు, ప్రజలతో నిండిపోయింది. కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపేందుకు అధికారులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో కలెక్టరేట్‌కు విచ్చేశారు. ఉమ్మడి జిల్లాలో అందరు ఎమ్మెల్యేల నివాసాల వద్ద వారి అభిమానుల కోలాహలం కన్పించింది. రాజకీయ పార్టీల నాయకుల ఇళ్ల వద్ద కూడా అదే సందడి కన్పించింది.

**కలెక్టరేట్‌లో సందడి**

అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో నూతన సంవత్సర వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. కలెక్టర్ ఎం.గౌతమి దంపతులు కేక్ కట్ చేశారు. ముందుగా జిల్లా కలెక్టర్, కలెక్టర్ గారి భర్త ఎం.రోహిత్ లు కేక్ కట్ చేశారు. అనంతరం జిల్లా స్థాయి అధికారులు కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతన ఏడాదిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువచేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం తమ వంతు కృషి చేయాలన్నారు. జిల్లాను అభివృద్ధి బాటలో నడిపించేందుకు జిల్లా అధికార యంత్రాంగం దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



హిందూపురం మున్సిపాల్టీ వద్ద మున్సిపల్ కార్మికులు నిరసన



పుట్టపర్తిలో అంగన్‌వాడీల మానవహారం



కొత్తచెరువు డిఇఒ కార్యాలయం వద్ద ఎస్ఎస్ఎ ఉద్యోగుల నిరసన

# నిరసనాగ్రహం.. ఉద్యమ పథం..!

**ఎన్నికల ముందు పాదయాత్రలో జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంతో పలు శాఖలకు చెందిన చిరుద్యోగులు రోడ్డెక్కారు. తమ బతుకులు బాగుపడతాయని నాడు వైసిపికి ఓటు వేస్తే తగిన బుద్ధి చెప్పారంటూ ఎక్కడికక్కడ నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అంగన్ వాడీలు ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తున్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలంటూ పురపాలక పారిశుధ్య కార్మికులు నిరవధిక సమ్మె చేపట్టారు. సమగ్ర శిక్షలో పని చేస్తున్న ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులు నిరసనలు కొనసాగిస్తున్నారు. ఉపాధ్యాయులు తమ బకాయిలు మంజూరు చేయాలని, ప్రతి నెల ఒకటో తేదీనే వేతనాలు చెల్లించాలని యుటిఎఫ్ పోరుబాట పట్టడానికి సిద్ధమైంది. వీరితో పాటు విఆర్‌ఎలు ఇతర ఉద్యోగులు సైతం ఉద్యమాలకు సిద్ధం అవుతున్నారు.**

**ప్రజాశక్తి-హిందూపురం**

2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయక పోవడంతో పాటు తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలంటూ అంగన్‌వాడీలు సమ్మెబాట పట్టారు. కలెక్టరేట్ ప్రాంగణాలు, రహదారులు, తహశీల్దార్, మున్సిపల్ కార్యాలయాలు ఉద్యోగులు, కార్మికుల నినాదాలతో మార్మోగుతున్నాయి. కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని, ఫేస్ యాప్‌లను రద్దు చేయాలని, అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని, పింఛన్‌తో కూడిన ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ ఇవ్వాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలంటూ అంగన్వాడీలు సమ్మెబాట పట్టారు. 20 రోజులుగా ఉధృతంగా సమ్మె సాగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. రెండు జిల్లాల్లో దాదాపు ఆరు వేల మందికిపైగా అంగన్వాడీలు సమ్మెలో ఉన్నారు. దీంతో అంగన్వాడీ కేంద్రాలు సరిగా పని చేయడం లేదు. బలవంతంగా సచివాలయ ఉద్యోగులతో తెరిపించినా ఎటువంటి ప్రయోజనమూ లేకుండాపోయింది. 2019 ఎన్నికల్లో తెలంగాణ కంటే రూ.వెయ్యి అదనంగా అంగన్వాడీలకు వేతనం ఇస్తామంటూ జగన్ హామీ ఇచ్చారు. అది అమలుకు నోచుకోలేదు. తెలంగాణలో రూ.13 వేలకుపైగా అంగన్వాడీల వేతనం ఉండగా, ఆంధ్రలో రూ.11,500 మాత్రమే ఉంది. తాను ఇచ్చిన హామీని కూడా సిఎం మరిచిపోయారంటూ అంగన్వాడీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమ్మెబాట పట్టి తమ హక్కులపై సమరం చేస్తున్నారు. అంగన్వాడీల బాటలోనే సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మెకు దిగారు. గడిచిన 12 రోజులుగా సమగ్ర శిక్ష ఉద్యోగులు వివిధ రూపాల్లో కలెక్టరేట్ల వద్ద సమ్మెలో భాగంగా నిరసనలు చేస్తున్నారు. జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పాదయాత్ర సందర్భంగా కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని వాగ్దానం ఇచ్చి మరిచిపోయారు. సమగ్ర శిక్షలో పని చేస్తున్న అన్నిరకాల ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని, సమగ్రశిక్ష ఉద్యోగులందరికీ హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనే డిమాండ్లతో సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మెకు దిగారు. 12 రోజులు గడిచినా ప్రభుత్వం స్పందించని పరిస్థితి నెలకొంది. జిల్లాలోని సమగ్ర శిక్ష ఉద్యోగులంతా సమ్మెబాట పట్టడంతో విద్యాశాఖపై తీవ్ర ప్రభావం పడింది.

**సమ్మెకు దిగిన మున్సిపల్ కార్మికులు**

కరోనాలో అంతా ఇళ్లకు పరిమితమైనప్పుడు కూడా తమ ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహించిన మున్సిపల్ కార్మికుల గురించి ఎంత చెప్పినా తక్కువే. మున్సిపల్ కార్మికులకు నెలకు రూ.లక్ష జీతం ఇచ్చినా తక్కువే అని సిఎం జగన్ అప్పట్లో మాట్లాడారు. ఎన్నికల ముందు మున్సిపల్ కార్మికులకు వైసిపి అనేక హామీలు గుప్పించింది. నాలుగున్నరేళ్లు దాటినా ఒక్క హామీ కూడా అమలు చేయలేదు. మున్సిపల్ కార్మికులను ఆరు నెలల్లో పర్మినెంట్ చేస్తామని, సమాన పనికి సమాన వేతనం ఇస్తామని, ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ కల్పిస్తామంటూ ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదు. సమస్యలపై ఎన్నోసార్లు చర్చలు జరిపినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో మున్సిపల్ కార్మికులు సమ్మెబాట పట్టారు. రెండు జిల్లాల్లో దాదాపు ఐదు వేల మందికి పైగా మున్సిపల్ కార్మికులు సమ్మెలో ఉన్నారు.

**ఎస్ఎస్ఎ ఉద్యోగుల ఆందోళన**

సమస్యల పరిష్కారం కోరుతూ సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు సమ్మె బాట పట్టారు. శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయం వద్ద దీక్షా శిబిరాన్ని ఏర్పాటు చేసి గత 13 రోజులుగా సమ్మె చేస్తున్నారు. ప్రతి రోజూ వివిధ రూపాల్లో నిరసన కొనసాగిస్తున్నారు. ముఖ్యమంత్రి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వీరు డిమాండ్ చేస్తున్నారు.

◆ ప్రభుత్వ తీరుతో విసుగెత్తిన కార్మికులు, ఉద్యోగులు

◆ హక్కులు, ప్రభుత్వ హామీల అమలుకు పోరుబాట

◆ సమ్మెలో అంగన్వాడీ, ఎస్ఎస్ఎ ఉద్యోగులు, మున్సిపల్ కార్మికులు

◆ మొక్కవోని దీక్షతో ఆందోళనలు

**మిగతా రంగాల్లోనూ ఆందోళనలు**

ఇదే విధంగానే ఉపాధ్యాయులు ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు ఇవ్వాలని, తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. అదే విధంగా విఆర్ఎలకు సైతం నాలుగున్నరేళ్లలో రూపాయి వేతనం పెంచకపోగా, డిఎ వెనక్కి తీసుకోవడం వంటి అనేక సమస్యలపై ఆందోళన కార్యక్రమాలు చేపట్టడానికి సిద్ధం అవుతున్నారు. ఈ విషయంపై సమ్మెకు దిగుతామని వీరి ఇదివరకే హెచ్చరించారు. వేలాది మంది ఉద్యోగులు, కార్మికులు తమహక్కుల సాధనకై ప్రభుత్వంపై సమరానికి దిగడం సర్వత్రా చర్చనీయాంశమవుతోంది.



తహశీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించిన పేదలు

## ఇళ్ల స్థలాలు రెండు రోజుల్లో ఇవ్వాలి

### తహశీల్దార్ కార్యాలయంలో పేదల ఆందోళన

**ప్రజాశక్తి -పెనుకొండ**

పట్టణంలో ఇల్లు లేని పేదలకు రెండు రోజుల్లోగా ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమ వారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ముందుగా నిరుపేదలు తహశీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించి కోర్టు ఆదేశాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు పేదల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పేదలు ఇంటి అద్దె చెల్లించలేక దుర్భర జీవితం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తహశీల్దార్ లేకపోవడంతో డిప్యూటీ తహశీల్దార్ ఛాంబర్ వద్ద బైఠాయించి పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ తహశీల్దార్ స్పందించి తహశీల్దార్ పుట్టపర్తిలో సమావేశం లో వున్నారని, ఆయన వచ్చిన తర్వాత చర్చించి కోర్టు ఆదేశాలను అమలు చేస్తామని హామీ ఇవ్వడంతో పేదలు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి గౌతమి, వ్య.కా.సం. జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, సహాయ కార్యదర్శి గంగాధర్, కమిటీ సభ్యులు వెంకటరాముడు, నారాయణ, తిప్పన్న, ఉత్తప్ప, సిపిఎం నాయకులు తిప్పన్న, ఇళ్ల స్థలాల సాధన కమిటీ సభ్యులు, మహిళలు, పేదలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



యుటిఎఫ్ డైరీని ఆవిష్కరిస్తున్న గుండుమల తిప్పేస్వామి

## యుటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి-మడకశిర**

పట్టణంలోని బాలాజీనగర్ టిడిపి కార్యాలయంలో సోమ వారం మాజీ ఎమ్మెల్సీ, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించారు. గుండుమల మాట్లాడుతూ గతంలో చంద్రబాబు ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు 43 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చి ఉద్యోగ పక్షపాతిగా ఉంటే, నేడు ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు, పిఆర్సి, డిఎ, పిఎఫ్, ఎపిజి ఎల్ఐసి, 1వ తేదీ వేతనాలు చెల్లించలేని ఆర్థిక సంక్షోభంలో ఉందన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.భూతన్న, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాలింగప్ప, జోగప్ప, గుడి బండ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరసింహప్ప, మూడ్ల గిరియప్ప, నరసింహమూర్తి, ఈశ్వర్, వెంకటరమణ, హనుమంతరాయ, మహంతేశ్వర్, బిఎస్.రామకృష్ణ, దేవరాజు, నంజప్ప, రంగనాథ్, శివప్ప, నరసింహరాజు, సూర్యప్రకాష్, నిజలింగప్ప పాల్గొన్నారు.

## పార్టీకి ద్రోహం చేసే వారిని ఉపేక్షించం

### మడకశిర టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి

**ప్రజాశక్తి-మడకశిర**

తెలుగుదేశంపార్టీకి ద్రోహం చేసే వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ, నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి స్పష్టం చేశారు. ఆంగ్ల నూతన సంవత్సరం పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని బాలాజీనగర్ పార్టీ కార్యాలయంలో నియోజక వర్గ పార్టీ విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. గుండుమల మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా టిడిపికి రోజు రోజుకూ ఆదరణ పెరుగుతోందన్నారు. పార్టీకి ద్రోహం చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించే లేదని హెచ్చరించారు. నియోజకవర్గంలో పార్టీ కోసం కష్టపడిన వారికి ఎమ్మెల్యేగా అవకాశం దక్కుతుందని స్పష్టం చేశారు. 'బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని 5 మండలాల్లో క్లస్టర్, బూత్ ఇన్‌ఛార్జులు ఇంటింటికీ తిరిగి వంద శాతం పూర్తి చేశారని, వారికి పార్టీ జెండాను అందించి సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి బిఎస్ గురుమూర్తి, మండల కన్వీనర్లు లక్ష్మీనారాయణ, మనోహర్, దాసిరెడ్డి, కుమారస్వామి, మద్దనకుంటప్ప, గణేష్, సర్పంచులు రామాంజనేయులు, గంగమ్మనాగరాజు, కరెన్న, నాయకులు కల్లు మర్రి నాగరాజు, కన్నా, నాగరాజు, నాయీ బ్రాహ్మణ సాధికారిక కన్వీనర్ రామాంజనేయులు, మీడియా కోఆర్డినేటర్ బేగార్లపల్లి రవికుమార్, డాక్టర్ సెల్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, గోరంట్ల సుధీర్, మల్లికార్జున, జిఎస్ యోగానంద, చంద్రప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గుండుమల తిప్పేస్వామి

**పలువురు టిడిపిలో చేరిక**

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని గుండుమల తిప్పేస్వామి ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల నుంచి వైసిపికి చెందిన 140 కుటుం బాలు టిడిపిలో చేరారు. వారిలో రొళ్ల మండలం కాకి పంచాయతీలో 50 కుటుంబాలు, మడకశిర మండలం సి.కొడిగేపల్లి పంచాయతీలో 50, హరేసముద్రం జయరామ్ తరపున 20, గౌడనహల్లి మాజీ ఎంపిటిసి సత్యనారాయణ, అతని అనుచరులు 20 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరగా గుండుమల వారికి పసుపు కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు.

## కందికుంట వెంకటప్రసాద్ ఇంట అభిమానుల సందడి

**ప్రజాశక్తి - కదిరి అర్బన్**

కదిరి టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ పుట్టిన రోజును పురస్కరించుకుని ఆయన ఇంటి వద్ద అభిమానుల సందడి నెలకొంది. సోమవారం నాడు నూతన సంవత్సరం, కందికుంట జన్మదినం కావడంతో పెద్ద సంఖ్యలో ఆయన అభిమానులు ఇంటి వద్దకొచ్చి శుభాకాంక్షలు తెలిపారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వచ్చారు. సోమవారం వేకువజాము నుంచి సాయంత్రం వరకు అభిమానులు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కందికుంట ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీకి వెళ్లాలని టిడిపి అభిమానులు ఆకాంక్షించారు. ఇంటి వద్దకొచ్చిన అభిమానుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



కందికుంటకు శుభాకాంక్షలు చెబుతున్న అభిమానులు

## పారిశుధ్య కార్మికుల నిరసన హోరు

**నిరవధిక సమ్మెలో భాగంగా 7వ రోజైన సోమవారం పారిశుధ్య కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో దీక్షా శిబిరాల్లో వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో రోడ్డుపైనే వంటా వార్పు కార్యక్రమం చేపట్టారు. పెనుకొండలో నిరసన ర్యాలీ చేపట్టి ఎమ్మెల్యే శంకరనారాయణకు వినతిపత్రం అందజేశారు. కదిరిలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. హిందూపురంలో రోడ్డుపై బైఠాయించగా స్పందించిన కమిషనర్ ప్రమోద్‌కుమార్ వారితో చర్చించారు. డిమాండ్లను పరిష్కరించేంత వరకూ సమ్మెను ఆపే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.**

**ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్**

మున్సిపల్ కార్మికులు చేస్తున్న నిరధిక సమ్మె ఏడవ రోజుకు చేరుకుంది. సోమవారం మున్సిపల్ కార్యాలయం ముందు కార్మిక నాయకులు సిఐటియు నాయకులు వంటావార్పు చేస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి పైపల్లి గంగాధర్, మున్సిపల్ కార్మికుల యూనియన్ నాయకులు నాగార్జున, నర్సింహులు, రామయ్య, పెద్దన్న, గోవిందు, మారక్క, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

**పెనుకొండ :** సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం నగర పంచాయతీ పారిశుధ్య కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు సమ్మెను కొనసాగించా రు. అనంతరం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సిఐటియు నాయకులు, పారిశుధ్య కార్మికులు ర్యాలీగా స్థానిక ఎమ్మెల్యే శంకరనారాయణ ఇంటి వద్దకు వెళ్లి వినతి పత్రం సమర్పించారు. నాయకులు మాట్లాడుతూ పాదయాత్ర సందర్భంగా పారిశుధ్య కార్మికులకు సిఎం జగన్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా, మండల కార్యదర్శులు రమేష్, బాబావలి, నగర పంచాయతీ కార్మికుల యూనియన్ నాయకులు చిన్న వెంకటేష్, రిక్షా నర్సింహులు, తిప్పన్న, ముత్యాలు, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

**కదిరి టౌన్ :** రాష్ట్రంలో దగాకోరు ప్రభుత్వం పాలిస్తోందని మున్సిపల్ కార్మికులు విమర్శించారు. తమ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె ఏడో రోజుకు చేరుకుంది. సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద దీక్ష కొనసాగించారు. ఈసందర్భంగా కార్మికులు కళ్ళకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు నాగేంద్రనాథ్, శ్రీనివాసులు మున్సిపల్ కార్మికులకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు బాలకృష్ణ, జనార్ధన, సూరి, చెన్నకృష్ణ, రాజు, చంద్రప్ప, రామాంజులు, సిఐటియు నాయకులు జగన్మోహన్, ఎస్ఎఫ్ఐ నాయకులు బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

**ధర్మవరం టౌన్ :** మున్సిపల్ కార్మికుల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వానికి పట్టవా అని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగార్జున ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారం 7వ రోజుకొనసాగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాగార్జున కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఆయూబ్‌ఖాన్, మున్సిపల్ కార్మికసంఘం గౌరవసలహాదారులు పెద్దక్క, వెంకటేశులు, సెక్రటరీ చెన్నకేశవులు, లక్ష్మీఓబులేసు, ప్రసాద్, ముకుందా, అవుట్ సోర్సింగ్ ఇంజనీరింగ్ విభాగపుఉద్యోగ కార్మికసంఘం అధ్యక్షులు అడ్రామహేశ్, బొగ్గు నాగరాజు, సాకే బాబు, అనిల్ కుమార్, దాసరిసురేశ్, అంకే పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

**హిందూపురం :** పారిశుధ్య కార్మికుల సమ్మెలపై ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని సిఐటియు జిల్లా నాయకులు సాంబశివ పేర్కొన్నారు. ఉదయం విధులకు హాజరవుతున్న పర్మినెంట్ కార్మికుల వద్దకు వెళ్లి తమ ఆందోళనకు మద్దతు ఇవ్వాలని కోరారు. విషయం తెలుసుకున్న కమిషనర్ ప్రమోద్‌కుమార్ అక్కడికి చేరుకుని మీరు నిరసన కార్యక్రమాన్ని కొనసాగించుకోవాలని, ఇతర కార్మికులను అడ్డుకుంటే చర్యలు తప్పవని సూచించారు. పర్మినెంట్ కార్మికులను భయభ్రాంతులకు గురి చేసి పనులు చేయిస్తే తప్పకుండా అడ్డుకుంటామని ఔట్ సోర్సింగ్ కార్మికులు స్పష్టం చేశారు. ఆందోళనలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జున, జగదీష్, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



పుట్టపర్తి : రోడ్డుపైనే వంటావార్పు కార్యక్రమం చేపట్టిన కార్మికులు



హిందూపురం : రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న కార్మికులు



ధర్మవరం : శిబిరంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగార్జున



పెనుకొండ : ఎమ్మెల్యే శంకరనారాయణకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు



కదిరి : దీక్షలో పాల్గొన్న పారిశుధ్య కార్మికులు

# అంగన్వాడీల సమస్యలు పట్టవా..?



కదిరిలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తంచేస్తున్న అంగన్వాడీలు, నాయకులు



పరిగిలో సమ్మె శిబిరం వద్ద కబడ్డీ ఆడుతున్న అంగన్వాడీలు

**ప్రజాశక్తి - కదిరి టౌన్**

తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 21వ రోజు చేరుకుంది. ఈ మేరకు సోమవారం అంగన్వాడీలు కళ్లకు గంతలు కట్టుకొని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ గుడ్డి ప్రభుత్వానికి తమ ఇబ్బందులు ఆవేదన అర్థంకాలేదని విమర్శలు గుప్పించారు. 20 రోజుల నుండి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జిఎల్. నరసింహులు, జగన్మోహన్, బాలకృష్ణ, ముస్తాక్, ఎస్ఎఫ్ఐ నాయకులు బాబ్జాన్, అంగన్వాడీ యూనియన్ నాయకులు మాబున్నీసా, చంద్రకళ, లక్ష్మీదేవి, శారద, సుశీల, మాత తదితరులు పాల్గొన్నారు.

**పరిగి :** తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీలు చేస్తున్న నిరవధిక సమ్మె 21వ రోజు కొనసాగింది. ఇందులో భాగంగా అంగన్వాడీలు సోమవారం స్థానిక తహశీల్దార్‌కార్యాలయం వద్ద కబడ్డీ ఆడి నిరసన తెలిపారు. అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వ వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం కొడిగేనహళ్లి సచివాలయం వద్ద ఎంపీడీవో సరస్వతి, సెక్రెటరీ నారాయణ కలిసి సిఐటియు జిల్లా అధ్యక్షుడు జడ్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు.

**ఓబుళదేవర చెరువు :** అంగన్వాడీలు నిరవధిక సమ్మెలో భాగంగా సోమవారం ఒంటి కాలి పై నిలబడి చేతులెత్తి మొక్కుతో నిరసన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు లక్ష్మినారాయణ. కుళ్లాయప్ప, అంగన్వాడీ యూనియన్ లీడర్లు వరలక్ష్మి, మణిమాల, కిష్టమ్మ, వరలక్ష్మి, కమలమ్మ. అరుణమ్మ, సరళమ్మ. పద్మావతమ్మ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

**చిలమత్తూరు :** అంగన్వాడీలు తమ నిరవధిక సమ్మెలో భాగంగా ఒంటి కాలిపై నిల్చొనినమస్కారం పెడుతూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమం లో వ్యకాసం ప్రవీణ్ కుమార్, లక్ష్మినారాయణ, అంగన్వాడీ యూనియన్ నాయకులు శోభమ్మ, రామతులసి, వనజమ్మ తదితరులు పాల్గొన్నారు.

**పుట్టపర్తి రూరల్:** అంగన్వాడీలు తమ న్యాయమైన కోర్కెల సాధన కొరకు సమ్మెలో దిగి సోమవారానికి 21 రోజులు అయింది. ఈసందర్భంగా అంగన్వాడీలు వినూత్న నిరసన తెలిపారు. పుట్టపర్తి ఐసిడిఎస్ కార్యాలయం ముందు బైటాయించారు. ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు,రాజకీయ నాయకులు, ప్రజలు నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకుంటూ స్వీట్లు పంచుకుని తింటుంటే తాము తమ పిల్లపాపలను వదిలి, రోడ్లపై పడ్డామని వాపోయారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా మిరపకాయలు తింటూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఇఎస్ వెంకటేష్, బాళ్ల అంజి, ప్రాజెక్టు, సెక్టార్ నాయకులు, అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

**ధర్మవరం టౌన్ :** తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె సోమవారానికి 21వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ ఎన్నికల ముందు జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు చంద్రకళ, పోతక్క, దీనా, మాంచాలినిదేవి, అనిత, క్రిష్ణవేణి, భువనేశ్వరి, లలిత తదితరులు పాల్గొన్నారు.

**ముదిగుబ్బ :** అంగన్వాడీలు తమ నిరవధిక సమ్మెలో భాగంగా సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షురాలు రజియా, అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

**పెనుకొండ :** సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె కొనసాగింది. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు వినూత్నంగా కబడ్డీ ఆడి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా, మండల కార్యదర్శులు రమేష్, బాబావలి, రైతు సంఘం జిల్లా నాయకులు హరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్దన్న, ఐద్వా నాయకురాలు గౌతమి, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు బావమ్మ, జయమ్మ, మాబున్నీసా, జ్యోతి, ఫరీద, ఉషారాణి, శోభ, పద్మ, రామలక్ష్మమ్మ, పాల్గొన్నారు.

**మడకశిర :** సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 21 రోజులుగా అంగన్వాడీ, మినీఅంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన సమ్మె కొనసాగింది. ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా అంగన్వాడీ లు వినూత్నంగా దీక్షా శిబిరంలోనే కేక్ కట్ చేశారు. అనంతరం శిబిరంలోనే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ తమ సమస్యలపై పెద్దఎత్తున నినాదాలు చేశారు. దీక్షలో యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీదేవి, ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

**సోమందేపల్లి :** అంగన్వాడీ కార్యకర్తలు నూతన సంవత్సరం రోజు కూడా సమ్మెను యథావిధిగా కొనసాగించారు. స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయ ఆవరణలో సిఐటియు జెండా చేత పట్టుకొని పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ నూతన సంవత్సరంలోనైనా దేవుడు ఈ ప్రభుత్వం, ముఖ్యమంత్రి మనసు మార్చి ఇచ్చిన మాటకు కట్టుబడి అంగన్వాడీల డిమాండ్స్ నెరవేర్చాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ సభ్యులు చంద్రకళ, నాగమణి, నాగరత్న, శోభ, అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

**లేపాక్షి :** స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు అంగన్వాడీ సిబ్బంది ఆటపాట కార్యక్రమంలో భాగంగా కోలాటం ఆడి నిరసన తెలిపారు. ఆంగ్ల నూతన సంవత్సరం రోజైనా సిఎం జగన్ స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించాలని అంగన్వాడీ సిబ్బంది కోరారు. ప్రభుత్వం న్యాయం చేయకపోతే రిటైర్డ్ అయిన తరువాత మా పరిస్థితి భిక్షాటన, ఆటపాట లాడి జీవనం సాగించాల్సిన పరిస్థితి ఉంటుందని, కావున వెంటనే న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు నరసింహప్ప, ధనమ్మ, రత్నమ్మ, పార్వతి, శశికళ, మండలంలోని అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

**అమరాపురం :** స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు సమ్మెను కొనసాగించారు. ప్రభుత్వం మొండివైఖరి వీడే వరకూ సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ రోడ్డుపైనే వంటా వార్పు కార్యక్రమం చేపట్టి అక్కడే భోజనం చేసి నిరసన వ్యక్తం చేశారు. దీక్షలో సిఐటియు నాయకుడు మహబూబ్‌ఖాన్, యూనియన్ లీడర్లు నాగవేణి, అనసూయమ్మ, మంజుల, చంద్రకళ, నాగరత్నమ్మ, సారక్క, తదితరులు పాల్గొన్నారు.

**హిందూపురం :** అంగన్వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన సమ్మె కొనసాగుతున్నది. 21వ రోజు సోమవారం అంగన్వాడీలు పట్టణంలోని సద్భవన్ సర్కిల్‌లో నిరసన దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి లావణ్య, నాయకులు శిరీషా, శైలజ, నాగమ్మ, విజయమ్మ, వరలక్ష్మి, గీతావాణి, భారతీ, రిహానాతో పాటు పెద్ద ఎత్తున అంగన్వాడీలు పాల్గొన్నారు.



పుట్టపర్తిలో మిరపకాయలు తింటూ అంగన్వాడీల నిరసన



చిలమత్తూరులో ఒంటికాలిపై నిరసన




సోమందేపల్లిలో నృత్యం చేస్తున్న అంగన్వాడీలు

## పోక్సో కేసు నమోదు

**ప్రజాశక్తి - చిలమత్తూరు**

చిలమత్తూరు పోలీసుస్టేషన్‌లో ఫోక్సో కేసు నమోదు అయింది. కనిశెట్టిపల్లి గ్రామానికి చెందిన యువకుడు అదే గ్రామానికి చెందిన బాలికపై అత్యాచారయత్నం చేసి లైంగిక వేధింపులకు గురిచేసిన ఘటనలో బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గంగాధర్ తెలిపారు. ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు వివరించారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న రత్నాకర్, తదితరులు

## ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

**పుట్టపర్తి రూరల్:** ప్రజాశక్తి 2024 శ్రీ సత్య సాయి జిల్లా పుట్టపర్తి క్యాలెండర్‌ను సెంట్రల్ ట్రస్టీ రత్నాకర్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాశక్తి దినపత్రిక ప్రజలకు మరింత చేరువై ఇంకా బాగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సత్య సాయి బంధువు కొండమరాజు, లాయర్ హరికృష్ణ, రాజారెడ్డి, రామాంజనేయులు, ఎం సురేంద్రబాబు, శేషాద్రి నాయుడు, బాలగంగాధర్, నారాయణ, జ్యోతి ప్రసాద్, ప్రజాశక్తి ప్రతినిధులు శ్రీనివాసులు, బసప్ప, పుట్టపర్తి రూరల్ విలేకరి మహేష్, కొత్తచెరువు రూరల్ లక్ష్మీనారాయణ, పుట్టపర్తి క్రైమ్ విలేఖరి సాయి తదితరులు పాల్గొన్నారు.

**హిందూపురం :** ప్రజాసమస్యలను అనునిత్యం వెలికితీస్తూ నిజాయితీగా, నిర్భయంగా వార్తలను ప్రచురించే సామర్థ్యం ప్రజాశక్తి దినపత్రికకు మాత్రమే ఉందని వైసిపి ఇన్‌చార్జ్ దీపిక వేణురెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో ప్రజాశక్తి 2024 నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ ప్రజాశక్తి దినపత్రిక మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ చైర్మేన్ మహేంద్ర నాథ్ రెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## అన్ని సౌకర్యాలూ కల్పిస్తాం...

**ప్రజాశక్తి-హిందూపురం**



స్థల పరిశీలన చేస్తున్న నాయకులు

పట్టణంలోని పరిగి రోడ్డులో 3, 4వ తేదీలలో నిర్వహిస్తున్న ఇస్తిమా నిర్వహణకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని వైసిపి నేత వేణు రెడ్డి అన్నారు. సోమవారం ఇస్తేమా జరుగుతున్న ప్రాంతాన్ని జామియా మసీదు కమిటీ, ముస్లిం మైనారిటీ మత పెద్దలతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మేన్ జబివుల్లా, వైసిపి ఎ బ్లాక్ కన్వీనర్ సిపిసి సాదిక్, మైనారిటీ నాయకులు చాంద్‌బాషా, కలీం, మత పెద్దలు, మైనార్టీ యువకులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి

**ప్రజాశక్తి-హిందూపురం**

విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించినప్పుడే గుర్తింపు పొందడానికి సాధ్యం అవుతుందని మండల విద్యాశాఖ అధికారి గంగప్ప అన్నారు. సోమవారం రాత్రి పట్టణంలోని పాంచజన్య బ్రిలియంట్ హై స్కూల్‌లో ఘనంగా కిండర్‌గార్డెన్‌డే కార్యక్రమం పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఇఒ మాట్లాడుతు ప్రతి విద్యార్థి విద్యతో పాటు అన్ని ఆటపాటల్లో పాల్గొనడం వల్ల మంచి ప్రతిభ సాధిస్తారన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ఎంతో ఉత్సాహభరితంగా చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎడి. స్మిత, నందిత, హెచ్ఎం. గాయత్రి, ఎఒ భాస్కర్, సూపరింటెండెంట్ విజయేంద్ర, ఎహెచ్ఎంలు శశికళ, సతీష్ కుమార్, షేక్ అబ్దుల్ రజాక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల అధ్యక్షులు శ్రీనివాసులు, సిబ్బంది



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న చిన్నారులు

## చలో విజయవాడను జయప్రదం చేయండి

**ప్రజాశక్తి - కదిరి టౌన్**

అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజంట్స్ వెల్ఫేర్ అసోషియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 3,4 తేదీలలో నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అగ్రిగోల్డ్ బాధితుల అసోసియేషన్ అధ్యక్షులు అత్తార్ మహబూబ్ బాషా కోరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడతూ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చడంలో విఫలమయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ కార్యవర్గ సభ్యులు ఆనంద బాబు, ఉత్తన్న, షబ్బీర్, సత్యనారాయణ, నాగేంద్ర, ఫక్రుద్దీన్, వెంకటేశ్, మహమ్మద్ రఫీ, షమీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి విరాళం

**తనకల్లు :** మండల పరిధిలోని మండ్లిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సీతారామాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి గతంలో ప్రకటించిన విధంగా 50వేల రూపాయలను గ్రామస్తులకు మాజీ ఎమ్మెల్యే కందికుంట అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి, మాజీ కన్వీనర్ శంకర్ నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి కుంచె నాగేంద్ర ప్రసాద్, మాజీ జెడ్పీటీసీ రవీందర్ రెడ్డి, ఆనంద రెడ్డి, సోంపాల్యం నాగభూషణ, వేమనారాయణ, గ్రామస్తులు ఓబులేసు,రమేష్, రమణ, లక్ష్మీనారాయణ, రామమోహన్, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

## టిడిపిలో పలువురు చేరిక

**కదిరి అర్బన్ :** పట్టణ పరిధిలోని కూరగాయల మార్కెట్లో వ్యాపారాలు చేస్తున్న మైనార్టీ నాయకులు టిడిపిలో చేరారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మైనార్టీ నాయకులకు టిడిపి కండువా వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కందికుంట వెంకటప్రసాద్ జన్మదిన వేడుకలను మార్కెట్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఆత్మీయ సమావేశం

**పజాశక్తి కదిరి అర్బన్**

మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లిలో వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్ నివాసంలో సోమవారం ఆత్మీయ కలయికను ఏర్పాటు చేశారు. పార్టీలకతీతంగా ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, కుల సంఘాల నాయకులు, అభిమానులు స్నేహితులు బంధుమిత్రులు ముస్లిం మైనార్టీ నాయకులు పెద్ద ఎత్తున వచ్చి వైసిపి రాష్ట్ర బీసీ విభాగం ఉపాధ్యక్షులు డాక్టర్ బత్తల హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తల వెంకటరమణకు పుష్ప గుచ్చాలు అందజేసి పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



బత్తల హరిప్రసాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

## సిఎంకు ఎస్ఎస్ఎ ఉద్యోగుల నిరసన లేఖలు



ఎస్ఎస్ఎ ఉద్యోగుల నిరసన ర్యాలీ

**ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్**

తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎస్ఎ ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మె సోమవారం కొనసాగింది. సమ్మెలో భాగంగా ఉద్యోగులు ముఖ్యమంత్రికి లేఖలు సంధించారు.13వ రోజు సమ్మెలో భాగంగా సమగ్రశిక్ష కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ జేఏసీ ఆధ్వర్యంలో న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఉద్యోగులు పెద్ద ఎత్తున పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. అనంతరం పోస్ట్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రికి లేఖలు రాసి పోస్ట్ బాక్స్‌లో వేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ మాట్లాడుతూ ఉద్యోగులు సమ్మె చేపట్టి 12 రోజులు పూర్తి అవుతున్న ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు ముందుకు రాకపోవటం దుర్మార్గమన్నారు. సంఘ నాయకులతో కనీసం సంప్రదింపులు కూడా జరపలేదని, ఉద్యోగుల నిరసనలు, సమ్మెలు ముఖ్యమంత్రి చెవిన పడలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా అధ్యక్షులు ఓబిరెడ్డి, రామన్న వెంకటరమణ, రవి, నాగరాజు, ఓబులేసు, స్వర్ణ, సోమశేఖర్, రాజశేఖర్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# నాయకుల ఇళ్ల వద్ద సందడి

**నూతన సంవత్సరం సందర్భంగా జిల్లాలోని టిడిపి, వైసిపి, జనసేన పార్టీల నాయకుల ఇళ్లతో పాటు జిల్లాస్థాయి అధికారుల కార్యాలయాల్లో అధికారుల సందడి నెలకొంది. ఈసందర్భంగా ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు తమ నాయకులు, ఎమ్మెల్యేల ఇళ్ల వద్దకు వెళ్లి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయా శాఖల అధికారులు తమ ఉన్నతాధికారులను కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కేక్‌లు కట్ చేయించి పూలబొకెలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కదిరి మాజీ ఎమ్మెల్యే కందికుంటకు ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.**



ఎస్పీకి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతున్న కార్యాలయ సిబ్బంది, తదితరులు



టిడిపి జిల్లా అధ్యక్షులు పార్థసారథికి నూతన సంవత్సర శుభాకాంక్షలు నాయకులు, అభిమానులు



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న బంగారు కృష్ణమూర్తి, కందికుంట వెంకటప్రసాద్



మాజీ ఎమ్మెల్యే కందికుంటను పూలమాలతో సన్మానిస్తున్న నాయకులు, అభిమానులు



ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న చైర్‌పర్సన్, తదితరులు



గోనుగుంట్ల సూర్యనారాయణను పూలమాలతో సన్మానిస్తున్న నాయకులు, అభిమానులు



పరిటాల శ్రీరామ్‌ను పూలమాలతో సన్మానిస్తున్న నాయకులు, అభిమానులు



చిలకం మధుసూదన్‌రెడ్డిని పూలమాలతో సన్మానిస్తున్న నాయకులు, అభిమానులు